క్లుప్తంగా

సామర్థ్యాల సర్వే పరీక్షకు 496 మంది హాజరు

ఎంఈవో లలితాకుమారి

శావల్యాపురం: మండలంలో 17 ప్రభుత్వ ప్రవేటు పాఠశాలల్లో విద్యార్థులు సామర్థ్యాల సర్వే పరీక్షలు 496 మంది విద్యార్థులతో పాటు 46 మంది ఉపాధ్యాయులు సిలబస్‌పై పరీక్షలు రాసినట్లు ఎంఈవో పుసులూరి లలితా కుమారి శనివారం తెలిపారు. స్థానిక మండల వనరుల కేంద్రలో ఎంఈవో మాట్లాడుతూ 3,6,9 తరగతులు చదువుతున్న విద్యార్థుల్లో సామర్థ్యాలను వెలికితీయటానికి ఈ పరీక్షలు దోహదపడతాయన్నారు. ఉపాధ్యాయులు రాసిన పరీక్షలు వలన న్యూ ఎడ్యూకేషన్ సిలబస్ తదితరవన్నీ నివృత్తి చేసుకోవడానికి ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఓయంఆర్ షిట్స్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపినట్లు తెలిపారు. సీఆర్‌పీ రావూరి శివ ప్రసాదు, ఏలికా శ్రీనివాసరావు, శ్రీహరి ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కేబీఆర్ కళాశాల విద్యార్థులు



నరసరావుపేట ఈస్ట్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు కాసు బ్రహ్మానందరెడ్డి జూనియర్ కళాశాలకు చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.వి.నాగిరెడ్డి శనివారం తెలిపారు. తమ విద్యార్థులు ఎం.జాన్‌రెడ్డి అండర్-17 క్రికెట్ పోటీకి, షేక్.రోహన్ జాన్మర్ అథ్లెటిక్ (డిస్కస్ త్రో) విభాగానికి ఎంపికైనట్టు వివరించారు. త్వరలో పట్టణంలోని డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలలో తమ విద్యార్థులు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి, గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ ఎ.వెంకటశివ, వ్యాయామ అధ్యాపకుడు ఎం.వినీల్, అధ్యాపకులు అభినందించారు.

95 శాతం పింఛన్ల పంపిణీ



నాదెండ్ల: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో నాలుగోరోజు శనివారం వైఎస్సార్ పెన్షన్ కానుక-సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ 95 శాతం పూర్తయింది. వలంటీర్లు ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ నగదు అందించారు. మండల పరిధిలో 9701 మంది లబ్ధిదారులకు గాను రూ.2,67,47,500లు పంపిణీ చేస్తున్నారు. ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, ఆయా సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు. గణపవరంలోని రెండో సచివాలయం పరిధిలో 80 ఏళ్ల వృద్ధురాలు శ్రీరామ కాంతమ్మకు వేలిముద్రలు పడకపోవటంతో వెల్ఫేర్ అసిస్టెంట్ దయానిధి లబ్ధిదారు గృహానికి వెళ్లి ఐరిష్ నమోదుతో పింఛను అందించారు.

నేడు అన్నారంలో గడపగడపకు మన ప్రభుత్వం

రొంపిచర్ల: మండలంలోని అన్నారం గ్రామంలో ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి శనివారం పేర్కొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అధికారులతో కలిసిహాజరై ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను వివరిస్తూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించటం జరుగుతుందన్నారు. కావున మండల ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కరుణించిన వరుణుడు

నాదెండ్ల: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షాభావం కారణంగా పంటలు ఎండిపోతున్న తరుణంలో శనివారం కురిసిన వర్షం రైతుల్లో ఆనందాన్ని నింపింది. ఒంటిగంట సమయంలో కురిసిన వర్షం రైతుల్లో ఆనందం నింపింది.

బీఎల్‌వోలు అప్రమత్తంగా ఉండాలి



బీఎల్‌వోలకు సూచనలు ఇస్తున్న ఆర్డీవో శేషిరెడ్డి, కమిషనర్ రామ్మోహన్



నూతన ఓటరు నుంచి ఫారం స్వీకరిస్తున్న ఆర్డీవో శేషిరెడ్డి, కమిషనర్ రామ్మోహన్

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎన్నికల అధికారులు

నరసరావుపేట: ఓటరు నమోదులో బీఎల్‌వోలు అప్రమత్తంగా వ్యవహరించాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో ఎం.శేషిరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియలో భాగంగా ప్రతి పోలింగ్ బూత్ వద్ద శని, ఆదివారాల్లో బూత్ లెవల్ అధికారులు ఉండి ప్రజల వద్ద నుంచి ఓటరు నమోదు చెందిన ఫారాలను స్వీకరించే ప్రక్రియను ఆయన సహాయ ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ పలుచోట్ల పరిశీలించారు. శంకరభారతీపురం హైస్కూలు, మున్సిపల్ హైస్కూలు, హార్డు కాంపౌండ్‌లలో పోలింగ్ బూత్‌లను సందర్శించి అక్కడనున్న బీఎల్‌వోలకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఒకే డోర్‌నంబరుపై పదిమంది కంటే ఎక్కువ ఓటర్లు ఉండటం, జీరో డోర్ నంబరు కల్గిన ఓటర్లు, వందేళ్ల దాటిన ఓటరు నమోదులో అప్రమత్తంగా ఉండాలని అన్నారు. నూతన ఓటర్ల నమోదుకు ఫారం-6, మృతిచెందిన వారి ఓటు తొలగించేందుకు ఫారం-7, మార్పులు, సవరణలు, ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రంకు ఓటు బదిలీకోసం ఫారం-8 దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

సామాజిక బస్సు యాత్ర విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే బొల్లా పిలుపు
- రైతులను ఆదుకునేది మా ప్రభుత్వమే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): సామాజిక సాధికారిత బస్సు యాత్ర, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మానాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేరకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన వినుకొండలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మంత్రులు, చైర్మన్లు, ఎంపీ విజయసాయిరెడ్డి, ఉపముఖ్యమంత్రి అంజాద్ బాష, రాష్ట్ర మంత్రులు విడదల రజని, ఆదిమూలపు సురేష్, బొత్స సత్యనారాయణ, మేరుగు నాగార్జున, పాల్గొంటున్నట్లు తెలిపారు. వినుకొండ రూరల్ మండలం వితంరాజుపల్లి వద్ద నుంచి పాదయాత్రగా వినుకొండ చేరుకుని ప్రభుత్వ వైద్యశాల వద్ద బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

వాస్తవాలు మాట్లాడాలి

టీడీపీ మాజీ మంత్రులు ప్రత్తిపాటి, పుల్లారావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలు వాస్తవాలు మాట్లాడాలన్నారు. నీరు లేక రైతులు ట్యాంకర్లతో పంటలు సాగు చేసుకుంటున్నారని, 80 శాతం ప్రభుత్వం నష్ట పరిహారం ఇవ్వాలనే వారి మాటలను ఎమ్మెల్యే బొల్లా ఖండించారు. వినుకొండలో పంటలు ఎండిపోతున్నాయని, హడావిడి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తుందన్నారు. ఏ ఒక్క రైతు నష్టపోకుండా ఆదుకుంటామన్నారు. టీడీపీ హయాంలో రైతులు కనీసం రుణమాఫీ కూడా అందక తీవ్ర ఇబ్బందులు పడ్డారని, చంద్రబాబు పరిపాలనలో రైతులు వర్షాలు లేక తీవ్ర కరువు పరిస్థితులతో అల్లాడిపోయారని గుర్తు చేశారు. ఇప్పటికైనా టీడీపీ నాయకులు వాస్తవాలు మాట్లాడాలని హితవుపలికారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పీఎస్ ఖాన్, జడ్పీ కోఆప్షన్ మెంబరు గుండాల స్వెనోమ్, నూజెండ్ల మండల కన్వీనర్ నక్కా నాగిరెడ్డి, జెడ్పీటీసీ విజయలక్ష్మి రాజా, సొసైటీ చైర్మన్ డూమావత్ గోవిందునాయక్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా వినుకొండవాసి మృతి



ఏడుకొండలు (ఫైల్)

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం మారెళ్లవారిపాలెం గ్రామ సమీపంలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన వ్యక్తి మృతదేహాన్ని ఐనవోలు పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఐనవోలు ఎస్సై అనీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వినుకొండ పట్టణం అంబేద్కర్ నగర్‌కు చెందిన పులి ఏడుకొండలు (25) మారెళ్లవారిపాలెం, ఈదర ప్రధాన రహదారిపై మృతదేహం తలలేకుండా రోడ్డుపై పడి ఉండటంతో స్థానికులు సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని వినుకొండ ప్రభుత్వం వైద్యశాలలోని మార్చురికి తరలించారు. తలభాగం చిత్రమై ఉండటం, మొండెం వేరు కావటంతో హత్య, ప్రమాదమా అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. మృతుడికి భార్య పూజతోపాటు, ఇరువురు సంతానం ఉన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

వినుకొండ టౌన్: అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి యత్నించిన మృతి చెందినట్లు పట్టణ ఎస్ఐ డి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. పట్టణ శివారులోని కోటప్ప నగర్‌లో నివాసం ఉంటున్న మక్కెళ్ల రమేష్ (21) అప్పుల బాధ తాళలేక బుధవారం పురుగు మందు తాగాడు. అయితే భర్త వాంతులు చేసుకొంటుండగా భార్య నాగమణి గమనించింది. చికిత్స నిమిత్తం వెంటనే పట్టణంలోని ఓ ప్రవేట్ వైద్యశాల (బాలాజీ నర్సింగ్ హోం)కు తీసుకురాగా ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తీసుకు వెళ్లమని వైద్యులు సూచించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ రమేష్ శుక్రవారం రాత్రి మరణించాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పంటలు పరిశీలించిన వ్యవసాయాధికారులు



రొంపిచర్ల: పంటకు మోతాదుకు మించి రసాయనిక మందులను వాడడం వల్ల పంటలు దెబ్బ తింటాయని వ్యవసాయ శాఖ బృందం తెలియజేసింది. మండలంలోని నల్లగార్లపాడు, మాచవరం గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మినుము, మొక్కజొన్న, వరి, కంది తదితర పంటలను పరిశీలించింది. మాచవరంలోని ఒక రైతు తన మొక్కజొన్న పైరు యర్రగా మారి ఎండిపోతున్నదని నరసరావుపేట ఏడీఏకి ఫిర్యాదు చేయటంతో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, మొక్కజొన్న పైరును పరిశీలించారు. ప్రస్తుత తరుణంలో ఆ పైరుకు 100 మిల్లీ లీటర్ల పిచికారీ చేయాల్సిన రసాయనిక మందును 250 ఎంఎల్ పిచికారీ చేయడం వల్ల పైరు దెబ్బతిందని వారు తెలిపారు. తిరిగి పైరు యథాస్థితికి వచ్చేందుకు రైతు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, పిచికారీ చేయాల్సిన మందులను తెలియజేశారు. అలాగే మినుము పంటను పరిశీలించారు. బెట్ట పరిస్థితుల వలనే మినుము పంటకు ముడత ఆశించిందన్నారు. అలాగే ఈ గ్రామాల్లో రైతు సాగు చేస్తున్న వరి పైరును పరిశీలించారు. గ్రామాల్లో ఉన్న వర్మీకం పోస్ట్ ఎరువుల తయారీ కేంద్రాన్ని సందర్శించారు.

వాలీబాల్ పోటీల్లో సాయిశుష్మకు ద్వితీయ స్థానం



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న తహసీల్దారు జాన్‌సైదులు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో స్కూల్ గేమ్స్ అండర్-17 విభాగంలో వాలీబాల్ పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థి తుర్లపాటి సాయిశుష్మ (8వ తరగతి) సాధించటం అభినందనీయమని తహసీల్దారు షేక్ జాన్‌సైదులు అన్నారు. శనివారం స్కూల్ గేమ్స్ విభాగాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందనలు చెప్పారు.

ఈసందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు విద్యతో పాటు క్రీడాల్లో రాణించటం మంచి శుభపరిణామమన్నారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-14 వాలీబాల్ క్రీడా పోటీల్లో రెడ్డి హేమంత్ పాల్గొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. అభినందనలు తెలిపిన వారిలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహబుబ్ బాష, వ్యాయమా ఉపాధ్యాయులు కాకుమాను రాజేష్ ఉపాధ్యాయులు ఉన్నారు.

సత్తాచాటిన వేల్పూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న డిప్యూటీ డీఈవో వేణుగోపాల్

శావల్యాపురం: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి సైన్సు డ్రామా పోటీలు పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని పల్నాడు కళాక్షేత్రంలో శనివారం నిర్వహించినట్లు వేల్పూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ మహబుబ్ సుభాని శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాస్తు-వాస్తవం అను అంశంపై నాటికను ప్రదర్శించారు. వాస్తు వాస్తవం కాదని భౌగిలిక పరిసరాల ప్రకారం ఉన్న వనరుల ఆధారంగా ఇంటి నిర్మాణలు ఉండాలన్నారు. ఉత్తమ ప్రదర్శనగా గుర్తించి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించారు. త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి సైన్సు డ్రామా పల్నాడు జిల్లా తరుపున పాల్గొంటారన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు జ్యోతి శ్రీనివాసరావు గైడు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. సైన్సు ప్రదర్శన డ్రామా పోటీల్లో 9,10 తరగతులు విద్యార్థులు ఏడు మంది పాల్గొనగా వివేక్, పార్థు, జస్మిత్, సాయి కృష్ణ, సాయి చైతన్య, సాద్విక్, సంజయ్, షఫీలు విజేతలగా ఎంపికై నారు. జిల్లా సైన్సు అధికారి ఏపీ మధుకుమార్, డిప్యూటీ డీఈవో కె.వేణుగోపాల్, ఏంఈవో నాగేశ్వరరావులు కార్యక్రమంలో పాల్గొని విజేతలను అభినందించి బహుమతులు అందజేశారు. పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు, వివేకానంద పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు సంద్రపాటి చలపతిరావు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

కులగణన సాహసోపేత నిర్ణయం

నరసరావుపేట: మంత్రివర్గ సమావేశంలో కులగణన ప్రక్రియ చేపట్టాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని ఏపీ బొందిలి సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొందిలి శ్రీనివాససింగ్ శనివారం పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ తర్వాత రాష్ట్రంలో కులగణన ప్రక్రియ ప్రారంభమౌతుందని, దీంతో అణగారిన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం సమగ్ర కలగణన వివరాలు సేకరించటం జరగటం మంచి పరిణామన్నారు. ఎంతోమంది ముఖ్యమంత్రులు చేయలేని సాహసోపేతమైన నిర్ణయం సీఎం జగన్ తీసుకున్నారన్నారు. భవిష్యత్తులో బీసీలదే రాజ్యాధికారం ఉండే విధంగా అవకాశం కల్పించారన్నారు. ఇప్పటి వరకు అసెంబ్లీలో అడుగు పెట్టని కులాలు, కులగణన వలన లబ్ధి పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధన దిశగా సీఎం జగన్ అడుగుల వేయడం చాలా శుభపరిణామన్నారు. ఈసందర్భంగా సీఎంకు అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

అవ్వకు చేకూరిన 'రక్షణ'

- హైవే పక్కన బిక్కుబిక్కుమంటూ వృద్ధురాలు
- అటుగా వచ్చి.. చూసి స్పందించిన పోలీసులు
- గుంటూరు నిర్మల్ హృదయ్‌కి తరలింపు



నిర్మల్ హృదయ్ ఆశ్రమంలో చేర్పిస్తున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు హనుమంతరావు, గోపీ

యడ్లపాడు: "దారిపక్క చెట్టుకింద అరిన కుంపటి విధాన కుర్చున్నది ముసల్దొకతె మూలుగుతూ ముసురుతున్న ఈగలతో వేగలేక..." అంటూ మహాప్రస్థానంలో శ్రీశ్రీ రాసిన భిక్షు వర్షీయసి కవితకు ప్రతీకలా యడ్లపాడు గ్రామంలోని హైవే రహదారి వెంట శనివారం సాక్షత్కరించిదో 75 ఏళ్ల వృద్ధురాలు. అసలే ఎక్స్‌ప్రెస్ హైవే.. వందకు పైగా వేగంగా ప్రయాణించే వాహనాలు.. అందులోనూ ఆకాశం కరిమబ్బు దాల్చి.. చలిగాలులు వీస్తున్నాయి. ఏ క్షణమైనా వర్షం కురిసేలా ఉంది. బిక్కుబిక్కుమంటూ దిక్కుల్ని పరికిస్తూ దీనంగా కూర్చున్న ఆ వృద్ధురాలిని అటుగా వెళ్తున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు గమనించారు. సరిగ్గా నడవలేని ఆ వృద్ధురాలు హఠాత్తుగా హైవే రహదారి పక్క ఎలా ప్రత్యక్షమైందో అర్థం కాలేదు. ఆ దీనురాలి అవస్థను చూసి చలించారు. వాహనాన్ని ఆపి వివరాలు అడిగారు. మలివయసు మతిమరుపు వెరసి ఫలితం లేకపోయింది. దీంతో ఆమెను తమ వాహనంలో యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌కు తెచ్చారు. హైవే పెట్రోల్ సిబ్బంది హనుమంతరావు, గోపీను ఎస్ఐ అభినందించారు. వెంటనే ఆమె సంరక్షణ కోసం గుంటూరులోని నిర్మల్ ఆశ్రమానికి తరలించి, తమ మానవత్వాన్ని చాటుకున్నారు. ఆ తల్లి వివరాలు తెలిసిన వారు యడ్లపాడు పోలీస్‌స్టేషన్ లేదా నిర్మల్ హృదయ్ ఆశ్రమానికి వచ్చి మలిదశలో ఉన్న ఆమెకు ఆదరణ పంచాలని ఎస్ఐ సురేష్ కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



బ్రాహ్మణపల్లిలో ఓటరు లిస్ట్‌పై వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద శనివారం ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించారు. దీనిలో భాగంగా నియోజకవర్గ ఎన్నికల అధికారి శ్రీరాములు, తహసీల్దార్ కిరణ్‌కుమార్‌లు మండలంలోని బ్రాహ్మణపల్లి, వితంరాజుపల్లి, నరగాయపాలెం, దొండపాడు, నడిగడ్డ, శివాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూత్ లెవల్ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ఓటు హక్కు పొందుటకు ఫారం -6, తొలగింపులకు ఫారం -7, మార్పులు, చేర్పులకు ఫారం -8లపై ప్రజలకు అవగాహన కల్పించి వారి వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు.

ప్రజారోగ్యమే జగనన్న ధ్యేయం

- మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్
- నరసరావుపేట టౌన్‌హాలులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం
- మొత్తం 201 మందికి వైద్యసేవలు అందజేత

నరసరావుపేట: ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ కోరారు. షాలెంనగర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో 13వ వార్డు ప్రజల కోసం భువనచంద్ర టౌన్‌హాలులో శనివారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరానికి హాజరైన వారిని ఉద్దేశించి మాట్లాడుతూ ఎంతో ఖరీదైన వైద్యాన్ని ఇంటిగడపకే ఉచితంగా తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ఒక శిబిరం నిర్వహించటం జరుగుతుందని, ఆయా ప్రాంత వాసులు తప్పకుండా ఉపయోగించుకోవాలని సూచించారు. కాగా, శిబిరంలో మొత్తం 201 మంది వైద్యపరీక్షలు చేయించుకోగా వారిలో 107 మందికి కంటి వైద్యపరీక్షలు చేశారు. వీరిలో 127మంది మహిళలు, 64 మంది పురుషులు, ఎనిమిది మంది పిల్లలు ఉన్నారు. వీరందరికీ జనరల్ మెడిసిన్ వైద్యులు డింపుల్, ఎముకలు, కీళ్ల వైద్యాన్ని రాజశేఖర్‌తో పాటు ప్రాథమిక వైద్యులు ఆషాలత, జి.హర్షవర్ధన రెడ్డి, పర్వీన్ వైద్యసేవలు అందజేశారు. వైద్య సిబ్బంది బీపీ, షుగర్, రక్తపరీక్షలతో పాటు డాక్టర్ ఎంవీ కంటి వైద్య సిబ్బంది కళ్లపరీక్షలు చేశారు. మాజీ కౌన్సిలర్లు బెహరా విజయభారతి, మాగులూరి రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి ఎస్‌కే ఆంజనేయులు, వార్డు నాయకులు ఆరుదల సాంబశివరావు, టి.రాజశేఖరరెడ్డి, దేవిశెట్టి శ్రీనివాసరావు, పాదర్తి సుబ్రమణ్యం, శివకార్తీక్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు సేవలు అందజేశారు.



రోగులకు బీపీ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



తమ పేర్లను నమోదుచేసుకుంటున్న స్థానికులు

సైన్స్ నాటిక ప్రదర్శనలు అభినందనీయం



విజేతలకు బహుమతులు అందిస్తున్న డిప్యూటీ డీఈఓ వేణుగోపాలరావు

నరసరావుపేట ఈస్ట్: సామాన్యులను శాస్త్రీయ దృక్పథం వైపు మరలించేలా సైన్స్ నాటిక ప్రదర్శనలు నిర్వహించటం అభినందనీయమని డిప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు తెలిపారు. పల్నాడు రోడ్డులోని పల్నాడు కళాక్షేత్రంలో శనివారం జిల్లా సైన్స్ అధికారి ఏపి మధుకుమార్ పర్యవేక్షణలో జిల్లాస్థాయి సైన్స్ నాటిక పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి ఎనిమిది బృందాలు పోటీలో పాల్గొన్నాయి. విజేతలకు బహుమతులు అందించిన వేణుగోపాలరావు మాట్లాడుతూ, రాష్ట్రస్థాయి, దక్షిణ భారతదేశ స్థాయిల్లో ప్రతిభ కనపరిచి జాతీయస్థాయిలో బహుమతులు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయతపై అవగాహన పెంచుకుని దేశం గర్వించదగ్గ పౌరులుగా ఎదగాలని కోరారు. పోటీలో జెడ్పీ హైస్కూల్ వేల్పూరు ప్రథమ, కె.జి.బి.వి. సంతగుడిపాడు ద్వితీయ, జెడ్పీ హైస్కూల్ పాలపాడు తృతీయ బహుమతులు సాధించాయి. కార్యక్రమంలో ఎంఈఓ నాగేశ్వరరావు, అకడమిక్ కో ఆర్డినేటర్ సీతారామయ్య, కళాక్షేత్రం అధ్యక్షుడు పొన్నపాటి ఈశ్వరరెడ్డి, శ్రీనాథ కళాపరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి, రంగస్థలి అధ్యక్షుడు పి.బాజి తదితరులు పాల్గొన్నారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా షేక్.మహ్మద్ గౌస్, షేక్.మహ్మద్ గౌస్, షేక్.పాషా, జి.శ్రీనివాసరావు వ్యవహరించారు.

ఓటర్ల జాబితా శిబిరానికి 122 అర్జీలు



జాలాది పోలింగ్ స్టేషన్‌లో ఓటరుజాబితా పరిశీలిస్తున్న ఏఈఆర్‌వో కుటుంబరావు

యడ్లపాడు: రాష్ట్ర ఎన్నికల సంఘం, జిల్లా ఎన్నికల అధికారి వారి ఆదేశాల మేరకు మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం శనివారం నిర్వహించారు. మొత్తం 57 పోలింగ్ కేంద్రాల నుంచి 122 దరఖాస్తులు అధికారులకు అందాయి. వీటిలో ఫారం(6)..54 అర్జీలు, ఫారం(7)..28, ఫారం(8)..39 ఉన్నాయి.

రెండు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల పరిశీలన

ముసాయిదాపై ప్రజలకు బీఎల్‌వోలు అవగాహన కల్పించాలని తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు చెప్పారు. జాలాది, జగ్గాపురం గ్రామాల్లోని 104, 105, 106, 107 నంబర్ల పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. డ్రాఫ్ట్ పబ్లికేషన్ వివరాలు, జంక్, జీరో డోర్ నెంబర్, ఒకే డోర్ నెంబర్ లో 10మంది ఓటర్లు అంతకంటే ఎక్కువ ఉన్న వివరాలు, 100 ఏళ్ల వయస్సు పైబడిన ఓటర్లు, కొత్త ఓటర్లు, మృతుల ఓటర్లు వివరాలు బీఎల్‌వోలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ చక్రవర్తి, జాలాది వీఆర్వో కేపీ చారి, బీఎల్‌వోలు బుల్లెమ్మ, వీరశంకర్, కమలాకర్ ఉన్నారు.

సవరణలు పారదర్శకంగా చేయాలి

తహసీల్దారు జాన్‌సైదులు



పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి బీఎల్‌వోకు సూచనలు చేస్తున్న తహసీల్దారు జాన్‌సైదులు

శావల్యాపురం: ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు మండలంలోని అన్నీ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు తెలిపారు. శనివారం మండంలోని వేల్పూరు గ్రామంలో 108, 112, 113, 114 పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈసందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ 2024 నూతన ఓటర్ల జాబితా ముసాయిదా సవరణలు పారదర్శకంగా చేయాలన్నారు. మండలంలోని 34 పోలింగ్ కేంద్రాల్లోని బీఎల్‌వోల సారథ్యంలో నూతన ఓటర్ల జాబితా ప్రచురణ చేయటంతో పాటు బూత్‌ల వారీగా ప్రజలకు చదివి వినిపించేరన్నారు. నూతన ఓటర్ల జాబితాలో తప్పులు సవరణలు, మార్పులు, చేర్పులు తొలగింపులు తదితర వాటిపై వస్తున్న అభ్యంతరాలపై సమగ్ర ఆధారాలతో మరలా దరఖాస్తు చేసుకుంటే అర్హత కల్గియున్న వారందరికీ న్యాయం చేస్తామన్నారు. ఇదే ప్రక్రియ డిసెంబరు 2,3 తేదీల్లో జరుగుతుందన్నారు. ఆయనతో పాటు వీఆర్వో శ్రీనివాసరావు ఉన్నారు.

ఓటు నమోదుకు దరఖాస్తులు స్వీకారం



గణపవరం జెడ్పీ హైస్కూలులో స్పెషల్ డ్రైవ్ పర్యవేక్షిస్తున్న ఈఆర్‌వో వసంతబాబు

నాదెండ్ల: వచ్చే ఏడాది జనవరి నాటికి 18 ఏళ్లు నిండనున్న యువతీ యువకులు ఓటుహక్కు పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని చిలకలూరిపేట ఎన్నికల అధికారి వసంతబాబు చెప్పారు. గణపవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. శని, ఆదివారాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఓటర్ల జాబితాలో సవరణలు చేసే ఉద్దేశంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని 57 పోలింగ్ బూత్‌ల్లో ఫారం-6, 7, 8ల కోసం 61 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఆదివారం కూడా స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. ఈ నెల 11, 12 తేదీల్లో మరోసారి డ్రైవ్ ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్‌వోలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.